**తూరుపు** తెల్లవారక ముందే నిద్ర లేచి పోయింది కమల.

గత రాత్రి అంతా కలత నిద్రలోనే గడిచి పోయింది ఆమెకు. పొద్దు గూకింది మొదలు ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూడటం, కమ్మని ఊహలలో తేలిపోవటం—ఇదే సరిపోయింది. ఇంక నిద్రపోవటానికి సమయు మెక్కడిది?

కమల నిద్రపోనంత మాత్రాన రాత్రి తెల్లవారక పోతుందా?

ఎర్రబడిన కళ్ళతో, బద్ధకాన్ని లెక్కచెయ్య కుండా లేడిలా, చలాకీగా తిరగసాగింది కమల.

కూతుర్ని చూసి ఆశ్చర్యపోయింది సీతమ్మ:

ఈ వారం రోజుల్లోనూ బారెడు పొద్దెక్క కుండా కమల మంచం దిగిన రోజు లేదు.

"అదేమిటే? !" అని మొదటి రోజున విడూ రంగా అడిగితే— "అదంతేలే—బస్తీ పద్ధతి" అని గర్వంగా చెప్పింది. 'నిజమే కామోసు' అనుకొని ఆ పల్లెటూరి తల్లి సమాధానపడి వూరుకుంది.

అలాంటి దీ రోజున, ఇంత పెందరాడనే కూతురు నిద్ర లేచిందంటే, ఆ తల్లికి ఆశ్చర్యం కలగక మరేమవుతుంది? ఒక్క నిద్ర లేవటమేనా? అన్నీ కాళ్ళ దగ్గరికి అమర్చి పెట్టమని అథారిటీ చలాయించిన పిల్ల, తనకు తానుగా వచ్చి గృహ కృత్యాలలో సహాయపడసాగింది.

చల్ల చిలుకుతున్న తల్లితో—"ఈవేళ తలంటు పోసుకుంటానే" అంది కమల, గోముగా.

"మొన్ననేగా పోసుకున్నావు!" తన సహజ ధోరణిలో అంది సీతమ్మ.

"మొన్న పోసుకుంటే ఈవేళ పోసుకోకూడదా? చెమట పట్టి తలంతా జిడ్డుగా ఉంది."

"వద్దని ఎవ రన్నారే! పొంతకుండలో నీళ్ళు కాగి ఉన్నాయి. కుంకుడు కాయలు కొట్టుకో."

తొమ్మిదేళ్ళ చెల్లెల్ని పిలిచి, కుంకుడు కాయలు కొట్టి నానబెట్టమని పురమాయించింది కమల.

పాతిక ఎకరాల భూవసతిగల సంపన్న రైతు రామచంద్రయ్య. సీతమ్మ ఆయన ధర్మపత్ని. కమల ఆ దంపతుల ప్రథమ పుత్రిక.

రామచంద్రయ్య, సీతమ్మ పుట్టి పెరిగింది పల్లెటూరులోనే. ఆ విషయం వారి వేషభాషల్లో, ప్రస్ఫుటమవుతూ ఉంటుంది. నాగరికమైన ఫాషన్లు, బస్తీ బేషజాలు వాళ్ళలో మచ్చుకైనా కనుపించవు. కాని, చాలామంది పల్లెటూరివారిలాగే వాళ్ళకు కూడా బస్తీ జీవితంపై వెర్రి వ్యామోహం. ఆ మోజుతోనే తమ కూతురు కమలకు బస్తీ సంబంధం చేశారు—పట్నసదజగా, ఎంతో కష్ట పడి, ఖర్చుచేసి

నూరుపైన పల్లెపడుచు కమల. పెళ్ళిరోజు వరకు బస్తీ ముఖం ఎరగని అమాయకురాలు. వూళ్ళో ఉన్న ఎలిమెంటరీ స్కూల్లో అయిదవ తరగతి వరకు చదువుకుంది. ఆపైన చదివించగల స్తోమతు రామచంద్రయ్యకు ఉన్నప్పటికీ, ఆ వూళ్ళో హైస్కూలు లేని కారణంచేత ఆ పిల్ల చదువు అంతటితో ఆగిపోయింది. ఆడపిల్లను పొరుగూరు పంపించి చదివించే స్థితికి ఆ కుటుంబం ఇంకా ఎదగలేదు.

పెళ్ళినాటికి పదహారేళ్ళు కమలకు. అయితే నేం ? పుష్టిగా, ఆరోగ్యంగా ఉండి, పద్దెనిమిదో, ఇరవయ్యో అన్నట్టు కనుపిస్తుంది.

పొలాన పండిన ధాన్యం, పెరడులో కాసిన కూరలు, ఇంటిలో చేసిన పాడి, స్వచ్ఛమైన గాలి—నీరు, చీకూ చింతా లేని జీవితం—మనుషుల్ని శారీరకంగానే కాదు, మానసికంగానూ ఆరోగ్య వంతులుగా ఉంచగలవు.

రామచంద్రయ్యగారు కూతురికి బస్తీ సంబంధం చేశారు—అంటే ఎంత గొప్ప ! వారి బంధువర్గంలోనే కాదు, ఆ వూళ్ళోనే పెద్ద విశేషమై పోయిం దది.

నవలలు చదివే అలవాటు లేని కమల నవలా నాయకుల్ని తన సరసను వూహించుకొనే అవకాశం లేకపోయింది.

ఏడాదికో సినిమా అయినా చూసి ఎరగని ఆ పిల్ల దృష్టిలో సినిమా హీరోలు మానవాతీతులే కాని, మానవ మాత్రులు కారు.

తల్లి తండ్రుల మాటకు ఎదురు చెప్పనీయని బలీయమైన సంప్రదాయం ఉంది.

బస్తీ సంబంధం అనే ప్రత్యేకాకర్షణ ఒకటి ఉంది !

పర్యవసానంగా పెళ్ళిచూపులకు ముందే ఆ సంబంధానికి సుముఖురాలైంది కమల. పెళ్ళి చూపుల్లో అతణ్ణి చూసిన తరవాత మనఃస్ఫూర్తిగా ఇష పడింది.

అయితే, ఆమె ఇష్టా నిష్టాలను అడిగి తెలుసుకున్న వాళ్ళు పెళ్ళికి ముందూ, తరవాతా కూడా ఎవ్వరూ లేకపోయారు. అది అప్రస్తుత విషయం.

వివాహం అయిన తరవాత శ్రావణ మాసంలో కమలను కాపరానికి పంపించారు.

భాద్రపదంలో 'దసరా' వచ్చింది.

పండగ వారం రోజులు ఉందనగానే కూతుర్నీ, అల్లుణ్ణీ పిలువు చెయ్యటానికి వెళ్ళాడు రామ చంద్రయ్య.

కమలను ముందు పంపించి, తాను సెలవు చూసుకుని, నాలుగు రోజుల తరవాత వస్తా నన్నాడు కమల భర్త శ్రీహరి.

"అలాగే"నని కూతుర్ని వెంటబెట్టుకుని వచ్చేశాడు రామచంద్రయ్య.

శ్రీహరి వస్తానని చెప్పింది ఈ రోజే !

అదే కమల చేస్తున్న హడావుడికి అంతకూ కారణం.

తలంటు పూర్తయింది. తుండుతో తుడుచు కుంటూ, ఎండలో నిలబడి జుట్టు ఆరబెట్టుకో సాగింది కమల. ఆమె మనసు చేస్తున్న పనిమీద లగ్నం కావటం లేదు. పన్నెండు గంటలకు అటువైపు నుండి వచ్చే బండి ఉంది. అతను వచ్చేది ఆ బండిలోనే.

బండి వచ్చేది పన్నెండు గంటలకని తెలిసి ఉండీ, ఆ వేళ కాకుండానే కంగారుపడి పోసాగింది కమల. పాలేరు వెంకన్నను పిలిచి, స్టేషన్‌కు బండి కట్టుకుని వెళ్ళమని తొందరపెట్టసాగింది.

"ఇప్పట్నుంచే ఎందుకండీ ? పదకుండు గంటలకి బయల్దేరి ఎళ్తాన్లెండి. ఎంత దూర ముందని ! సావు గంటలో ఎల్లిపోవచ్చు టేసన్‌కి" అనేశాడు వెంకన్న.


"ఇంకా పదకొండు గంటలు కాలేదా?" అమాయకంగా అడిగింది కమల.


కమలకు వాచీ ఉంది. పెళ్ళిలో పేచీపెట్టి మరీ కొనిపించుకుంది. మొన్న వూరినుంచి రాగానే తీసి పెట్టెలో పెట్టింది. 'కీ' అయిపోయి ప్రస్తుతం అది విశ్రాంతి తీసుకుంటూంది.

"అప్పుడే పదకుండేంటండీ! ఇప్పుడు తొమ్మిదే అయింది !"

"ఇంకా తొమ్మిదేనా ! ఒకసారి సుబ్బయ్య కొట్టు దగ్గరికి వెళ్ళి అడిగిరా— టైమెంతయిందో?"

"నే నిప్పు డక్కడ్నుంచే వత్తన్నానండి—బీడీలు కొనుక్కోటాని కెళ్ళి. అయ్యగారు పొద్దున్నే చెప్పా






ర్లండి ఇయ్యాల అల్లుడుగారొస్తారని. వీూ అడావుడంతా అందుకేగా! యూళ కెల్లి, జద్దరంగా తీసుకొచ్చి, మీూ కప్పగిస్తా గాః—మీూరు గమ్మునుండండి!" అన్నాడు వెంకన్న చనువుగా.

ఆ విషయంలో ఇంకేమీూ అనలేకపోయింది కమల.

పెట్టెలోంచి వాచీ తీసి, కీ ఇచ్చి, వెంకన్న చెప్పిర

సైముకు మరొక పావు గంట కలిపి, తొమ్మిదింపావు మీద పెట్టింది కమల.

కమల బస్తీలో ఉన్నది కొద్ది రోజులే అయినా, ముఖ్యమైన బస్తీ పోకడలు కొన్ని అప్పుడే అలవరుచుకుంది.

తల చిక్కు తీసి, వదులుగా జడ అల్లుకుంది. సగం జుట్టు నుదుటిమీదా, చెంపలమీదా గాలికి ఎగిరి పడుతూనే ఉంది. ముఖాన దోస గింజంత బొట్టు పెట్టుకొంది. తలలో చేమంతి పూలు పెట్టుకుంది. లేత పసుపు రంగు చీర కట్టుకొని, మాచింగ్ బ్లౌజు వేసుకొంది.

పెళ్ళికి ముందు జడ గంటలు ఉండేవి. వాటిని శాశ్వతంగా పెట్టెలో పెట్టేసింది. లోలకుల స్థానాన్ని రింగులు ఆక్రమించుకున్నాయి.

ముఖానికి పసుపు, తలకు నూనె రాచుకోవటం మోటు అయిపోయింది. సోపులు, స్నోలు, సెంట్లు, పౌడర్లు, క్రీముల వాడకం తప్పనిసరి అయింది.

వేపపుల్లలు, గానుగ పుల్లలు వెగటని పిస్తున్నాయి. టూత్‌బ్రష్‌లూ, పేస్టులూ మోజుగా ఉన్నాయి.

వస్త్రధారణలోనూ, అలంకరణలోనూ, మాట ల్లోనూ, నడకలోనూ ఎంతో మార్పు వచ్చింది.

అందం, ఆరోగ్యం, అవయవ సౌష్ఠవం కల కమలకు ఈ మార్పులన్నీ మరింత శోభను సమకూర్చి పెట్టినవనే చెప్పుకోవాలి.

తను పుట్టి పెరిగిన వాతావరణం, పరిస్థితులు, మనుషులు, వారి మనస్తత్వాలు, నమ్మకాలు, ఆచారాలు—అన్నీ కలిపి బస్తీలో అడుగు పెట్టగానే మరొక ప్రపంచంలో ప్రవేశించిన అనుభూతిని కలిగించినాయి కమలకు. అయితే, అది తాత్కాలికమే. పరిశీలన, అనుకరణ, అభ్యాసం నెల తిరిగేసరికి కమలను పూర్తిగా మార్చివేసినాయి. అందుకు ఆమె భర్త శ్రీహరి ప్రయత్నం కూడా కొంత సహాయం చేసింది.

తండ్రి వెంట పండగకు బయలుదేరి వచ్చిన కమల వచ్చిన రోజునుంచే తన పుట్టింట్లో సంస్కరణ కార్యక్రమం ప్రారంభించింది.

సామానులన్నీ సక్రమంగా సర్దించింది.

గుమ్మాలకూ, కిటికీలకూ తెరలు కట్టించింది.

ముందు గదిలో నాలుగు కుర్చీలు వేసి, వాటి మధ్య ఒక ఎత్తు పీటను టీపాయ్‌గా అమర్చి, ఉతికిన గళ్ళ తువ్వాలును మడిచి దానిమీద పరిచింది. పాత కంచు చెంబు మిల మిల మెరిసేలా తోమించి, కాగితం పూలగుత్తులు, ఆకులతో సహా తెంపి ఆ చెంబులో వేసి ఫ్లవర్ వాజులా అలంకరించింది.

సందిరి మంచం ఉన్న దక్షిణంవేపు గదిపై ప్రత్యేక శ్రద్ధ చూపించింది. పరుపూ, దిండ్లూ ఎండలో వేయించింది. గలేబులు ఉడకపెట్టి ఉతికించింది. చెక్కీ పూడదీయించి, నవ్వారు మళ్ళీ నేయించింది. మంచం క్రింద అడ్డదిడ్డంగా పడి ఉన్న గోనె సంచుల కట్టలు, చిలక్కొయ్యలకు తగిలించి ఉన్న ఎద్దుల మెడలో వేసే మువ్వల పట్టెడలు మొదలైన పడకగదికి సంబంధించని మరికొన్ని సామానులూ అక్కడినుంచి మరొకచోటికి

> తమ నటన సమాప్తమైనప్పటికీ, ప్రేక్షకులను సంతోషపెట్టటానికి మళ్ళీ నాటక రంగం మీదికి వచ్చే నటుల వంటి వారు ఈ అవతార మూర్తులు.
>
> —స్వామి వివేకానంద

తరలింప జేసింది. గది నేల అంతా తడిగుడ్డతో తుడిపించి, స్వయంగా తనే ముద్ద ముగ్గులు పెట్టింది.

కూతురు చేస్తున్న హడావుడికి ఒక పక్క ఆశ్చర్యపోతూనే, మరొకపక్క ముచ్చటపడ సాగింది సీతమ్మ. అందుకనే కమల చేస్తున్న పనులకు ఆమె అడ్డు రాలేదు. కాని, ఉండబట్టలేక ఒకటి, రెండుసార్లు—'ఏమిటే ఇదంతా?' అని అడిగింది. 'ఇలా ఉండకపోతే ఆయనకి నచ్చదు' అని సమాధానం చెప్పింది కమల. 'కామోసు' లెమ్మనుకుంది సీతమ్మ.

ఇంట్లో నిలువుటద్దం లేకపోవటం పెద్ద లోటుగా కనిపించింది కమలకి. అరచెయ్యి అంత అద్దం పెంకులో ముఖమే పూర్తిగా కనిపించదు. పూర్తి బింబం చూసుకోవటం ఎలా? అలాగే ఇబ్బంది పడుతూ అయిదు నిమిషాల కొకసారి ఆ అద్దం సాయంతోనే తన సౌందర్యానికి మెరుగులు దిద్దుకోసాగింది. ఉదయం లేచింది లగాయతు ఎన్నిసార్లు అద్దాన్ని ఉపయోగించిందో ఆమెకే లెక్క తెలియదు. మరొకసారి ముంగురులు సవరించుకొని, వాచీ చూసుకుంది. పది గంటలు అయింది. ఇంకా పదేనా? కొంప దీసి వాచీ ఆగిపోలేదుకదా! చెయ్యి చెవిదగ్గర పెట్టుకొనిచూసింది. వాచీగుండెసక్రమంగానే కొట్టుకుంటూంది. అయినా, ఆమెకు వాచీ నడక మీద నమ్మకం కుదరలేదు. లేకపోతే ఇంకా పది గంటలే కావటం ఏమిటి?

"వెంకన్నా...వెంకన్నా!" గట్టిగా పిలిచింది కమల.

బండిలో చాప పరుస్తున్న వెంకన్న "ఏంటండీ?" అన్నాడు అక్కడినించే.

"టైమైపోయింది. బయలుదేరాలి. బండి వచ్చే వేళకు నువ్వక్కడ లేకపోతే, ఆయన నడిచి రావలసి వస్తుంది. రిక్షాలు కూడా ఉండ విక్కడ!"

ఇంకా వేళ కాలేదని అతనికి తెలిసి ఉన్నప్పటికీ, ఇక్కడ ఉంటే ఈ పిల్ల బతక నిచ్చేలా లేదని—"ఎల్తన్నానెండి" అన్నాడు కాస్త విసుగుగానే.

"త్వరగా వెళ్ళు మరీ!"

"ఆఁ ఆ అట్టాగే" అన్నాడు ఎడ్లను నీళ్ళకు విప్పుతూ.

ఎండ తగలకుండా పైన గూడు, మెత్తగా ఉండేలా క్రింద గడ్డి, దానిమీద చాప—సిద్ధం చేసిన బండికి ఎడ్లను పూన్చి, స్టేషన్ వైపు తోలుకు పోయాడు వెంకన్న.

కమల లోపలికి వెళ్ళి, చెల్లెలి సాయంతో గలేబులు దిండ్లకు తొడిగింది. పరుపూ, దిండ్లూ మంచం మీద సర్ది, ఉతికిన దుప్పటి పరిచింది. ఈ కొద్ది పాటి పనికే చెమట పట్టి, అలంకరణ చెదిరిపోయిం దేమోనన్న అనుమానం వచ్చి అద్దం చూసుకుంది.

డాబా ఎక్కి చూస్తే దూరంగా స్టేషన్ కనిపిస్తుంది. వెంకన్న బండి తోలుకు వెళ్ళిన తరవాత ప్రతి అయిదు నిమిషాలకు ఒకసారి డాబా ఎక్కి అటువేపు చూడసాగింది కమల. చెట్ల చాటున స్టేషను, అప్పుడప్పుడు పైన పొగ—ఆ పొగ పాసెంజరు బండిదో, గూడ్సు బండిదో తెలియక పోయినా, అది ఆయన వచ్చే బండే నన్నంత ఆత్రత, ఆనందం.

అసలు పదకొండు గంటల బండే అది. కాని, ఎప్పుడూ పన్నెండు గంటల తరవాతనే వస్తుంది కనక 'పన్నెండు గంటల బండి' అని వాడుక పడిపోయింది, పాపం! కమల అనే ఒక ఆడకూతురు తన భర్త రాకకోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తూందనీ, ఎంతగానో ఆరాటపడుతూందనీ తెలియని ఆ రైలుబండి ఈవేళ మరొక అర గంట ఎక్కువ ఆలస్యం చేసి, పన్నెండున్నరకు వచ్చింది.

గూడుబండి అల్లంత దూరాన కనుపించగానే సంభ్రమంగా డాబా దిగిపోయింది కమల. "బావ వస్తున్నాడే!" అని చెల్లెలితోనూ, "ఆయ నొచ్చేస్తున్నారే!" అని తల్లితోనూ ఆనందంగా చెప్పింది. ఇప్పుడు తనేం చెయ్యాలి?—అని ఆలోచిస్తే—ఉదయం కట్టిన ఈ చీరా, జాకెట్టూ నలిగిపోయి, చెమట పట్టినట్టనిపించింది. వెంటనే గదిలో దూరి తలుపు వేసుకొంది.

బండి వచ్చి ఇంటిముందు ఆగినా, గదిలో పని తెమలలేదు కమలకు.

"అక్కోయ్! బావొచ్చేశాడే!" అని చెల్లెలు తలుపులు బాదగా, త్వరగా ముగించుకొని తలుపులు తెరిచింది.

అప్పటికే నీళ్ళ తొట్టి దగ్గర కాళ్ళు కడుక్కొంటున్నాడు శ్రీహరి.

తల్లీ, చెల్లీ గుమ్మంలో నించుని ఉన్నారు. వాళ్ళను దాటుకొని ముందుకు వెళ్ళటానికి సిగ్గు ముంచుకు వచ్చింది కమలకు.

సూట్‌కేస్ తీసుకువచ్చిన వెంకన్న—"ఇదిగోం డమ్మాయిగోరూ! తీసుకొచ్చేశాను. పొద్దుట్నుంచీ ఒకటే కంగారు పెట్టేశారు. ఇంక మీ యిట్టం!" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

(భర్త వచ్చే సమయానికి తననూ, గృహాన్నీ అలంకరించుకొని, సిద్ధంగా ఉన్న నాయిక—వాసక సజ్జిక.)

## వచ్చే వారం శృంగార నాయిక-'విరహోత్కంఠిత'